క్లుప్తంగా

మైనార్టీ గురుకులం విద్యార్థుల ఆచూకీ లభ్యం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం బీకేరెడ్డి కాలనీలో మైనార్టీ బాలుర-3 గురుకులం నుంచి ఇద్దరు విద్యార్థులు పారిపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మైనార్టీ బాలుర గురుకులంలో 8వ తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులు అర్ధరాత్రి గురుకులం నుంచి పారిపోయారు. విద్యార్థులు నరసరావుపేట రైల్వే స్టేషన్‌లో బుధవారం రైల్వే ఆర్‌పీఎఫ్ పోలీసుల కంటపడడంతో వారు విచారించి చైల్డ్ లైన్ అధికారులకు అప్పగించారు. అక్కడి చైల్డ్ లైన్ అధికారులు ఇక్కడి చైల్డ్ లైన్ అధికారులకు సమాచారం అందించారు. గురువారం సాయంత్రం అక్కడి నుంచి విద్యార్థులు బయలుదేరగా శుక్రవారం ఉదయం చేరుకుంటారు. ఇక్కడి చైల్డ్ లైన్ అధికారుల సమక్షంలో విద్యార్థులను గురుకుల అధికారులకు అప్పగించనున్నారు. ఈ విషయమై ఆర్‌ఎల్‌సీ వివరణ కోరగా, విద్యార్థులు క్షేమంగా మహబూబ్‌నగర్‌కు వస్తున్నట్లు తెలిపారు. మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని సమాధానమిచ్చారు.

పాములపై విద్యార్థులకు అవగాహన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మండలంలోని తాటికొండ జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో గురువారం విద్యార్థులకు పాములపై జడ్చర్ల డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డా.సదాశివయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొన్ని పాములతో చైతన్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

చిన్నచింతకుంట: మండలంలోని అల్లీపూర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు అశ్విని, టి.సుచిత్ర, కే.గణేష్, సింధూజ, అక్షయలు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. అందుకు డిసెంబర్ 1న మంచిర్యాలలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర స్థాయి 10వ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొననున్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

దళిత హోదా అందరికీ వర్తింపజేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: దళిత హోదా అందరికీ వర్తింపజేయాలని తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ (ఆల్ మేవా) రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారుఖ్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. సామాజికంగా వెనుకబాటు, విద్య, ఆర్థిక, అన్ని రంగాల్లో వివక్షతకు గురైన వారందరినీ దళిత హోదా కల్పించాలని, దానికి మతాలను అంటగడితే ఎలా అని పేర్కొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంల పోస్టులు భర్తీ చేయాలి

పాలమూరు: రెండో ఏఎన్‌ఎంల అదనపు పోస్టులు పెంచి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 2న కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ఆందోళన నోటీస్‌ను తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య శాఖ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ సవరించి రెండో ఏఎన్‌ఎం పోస్టులు పెంచి కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎంలు గిరిజారెడ్డి, జయమ్మ, వెంకటేశ్వరమ్మ, అరుణ, హేమలత, సుజాత పాల్గొన్నారు.

ట్రెజరర్‌కు సన్మానం

దేవరకద్ర: తెలంగాణ గజిటెడ్ హెచ్‌ఎమ్ అసోసియేషన్ జిల్లా ట్రెజరర్‌గా ఎన్నికైన సందర్భంగా అబ్దుల్ హక్‌ను గురువారం దేవరకద్రలో ఘనంగా సన్మానించారు. ఎంఈఓ బలరాం ఆయనకు శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎమ్‌లు శ్రీనివాస్ గౌడ్, సుధాకర్‌రెడ్డి, కృష్ణ ఇంకా పలువురు అబ్దుల్ హక్‌కు అభినందలు తెలిపారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అడ్డాకుల: భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు మద్దూరి కరుణాకర్‌రెడ్డి ఈనెల 26న తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో గురువారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నవాబుపేట: మండలంలోని కారూర్ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. గురువారం గ్రామ సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా తిర్మలాపూర్ గ్రామానికి చెందిన జగనాథ్ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా, పోలీసులను చూసి పారిపోయాడు. దీంతో ట్రాక్టర్ నంబర్ ఆధారంగా కేసు నమోదు చేసి ట్రాక్టర్ సీజ్ చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

అభివృద్ధే మా నినాదం



బాలసదన్‌లో కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- చిల్డ్రన్స్ హోం భవన నిర్మాణానికి శంకుస్థాపన
- 6, 25, 26వ వార్డుల్లో సీసీరోడ్లు ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: చిల్లర రాజకీయాలు కాదు.. అభివృద్ధే తమ నినాదమని పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలసదన్‌లో రూ.1.35 కోట్లతో నిర్మించనున్న అధునాతన భవనానికి శంకుస్థాపన చేశారు. శ్రీనివాస కాలనీ (వార్డు నం.6) లో, గోల్ మసీదు ప్రాంతం (వార్డు నం.25) లో, హబీబ్‌నగర్ (వార్డు నం.26) లో నిర్మించిన మూడు సీసీరోడ్లను ప్రారంభించారు. అలాగే పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బాలసదన్‌లో ఐదేళ్లలోపు బాలబాలికలకు ప్లే స్కూల్ మాదిరిగా అన్నీ అందుబాటులోకి తెస్తామన్నారు. రానున్న రెండేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మిస్తామన్నారు. ప్రతి కాలనీని అభివృద్ధి చేస్తామని, అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిల్లలను విధిగా పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, ముడా చైర్మన్లు ఒబేదుల్లాకొత్వాల్, కె.లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, వైస్‌చైర్మన్ విజయకుమార్, మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్‌చైర్మన్ షబ్బీర్ అహ్మద్, కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులు, కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాద్రీ, సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, జలీల్, ఖాజాపాషా, రషీద్‌ఖాన్, ప్రశాంత్, రాజేందర్‌రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జరీనాబేగం, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఎంఈయు.బస్వరాజ్, సీడీపీఓ శైలశ్రీ పాల్గొన్నారు.

అమ్మవారు అండగా ఉండాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: అంబా భవానీ అమ్మవారు నూతన కమిటీకి అండగా ఉండి మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో భవసార్ క్షత్రియ రంగ్రేజ్ సమాజం నూతన కమిటీ ప్రమాణాస్వీకార మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భవసార్ క్షత్రియ సంక్షేమం, అంబా భవానీ దేవాలయం, సమాజం అభివృద్ధి ఉండే విధంగా దూరదృష్టితో పనిచేయాలని కోరారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన విశ్వనాథ్ బండేకర్‌కు సర్టిఫికెట్ అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, నాగురావు నామాజీ, సిరాజ్‌ఖాద్రీ, ఉమేష్‌కుమార్, కృష్ణ బగాడే పాల్గొన్నారు.

కంచన్‌పల్లిలో డ్వాక్రా సంఘాల వివరాల సేకరణ



కంచన్‌పల్లిలో డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న అధికారులు

మహమ్మదాబాద్: మండలంలోని కంచన్‌పల్లిలో కొంత కాలంగా డ్వాక్రా సంఘాల డబ్బు అదే గ్రామానికి చెందిన వీబీకే లక్ష్మి భర్త రాజు వాడుకున్నాడన్న ఫిర్యాదుతో గురువారం అధికారులు గ్రామానికి చేరుకున్నారు. డీఆర్‌డీఓ ఏపీడీ జోజప్ప, డీఆర్‌ఎం రాంనాయక్, డీపీఎం రాంనాయక్‌ల ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ఆరు సంఘాల్లో డబ్బులు వాడుకున్నారని ఉన్నతాధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. మండల అధికారులు ఏపీఎం మాత్రం రెండు సంఘాల డబ్బు వాడుకున్నట్లు పేర్కొన్నారు. వీబీకే బ్యాంక్‌లో వేసే రుణాలను వాడుకుని సంఘాల్లో సభ్యులకు ఎంతో నష్టం చేశారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గమనించి మహిళలను మోసం చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వారి వెంట ఆడిటర్ చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

ఎల్‌ఓసీని అందజేసిన ఎమ్మెల్యే

అడ్డాకుల: మండలంలోని రాచాల గ్రామానికి చెందిన లక్ష్మయ్య గుండె సంబంధిత వ్యాధికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చేరడంతో చికిత్స నిమిత్తం సీఎం ఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.50లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. బాధితుడి కుమారుడు శ్రీనివాస్‌కు గురువారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో శ్రీహరి, నాగిరెడ్డి, శెట్టిశేఖర్, కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

రైతు పండుగకు తరలిన రైతులు

మహమ్మదాబాద్/గండేడ్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు రైతులకు తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు పండుగ కార్యక్రమానికి గండేడ్, మహమ్మదాబాద్ మండలాల నుంచి రైతులు తరలివెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌పై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల మండలాల నుంచి రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో బస్సులు ఖాళీగా వెళ్లిపోయాయి. మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతీబాయి, ముకుందం, నారాయణ, గోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నమోదు ప్రక్రియ

జడ్చర్ల టౌన్: సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, కులగణన ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం జడ్చర్లలో కొనసాగుతోంది. మున్సిపాలిటీ పరిధిలో 35 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు నమోదులో నిమగ్నమయ్యారు. మున్సిపాలిటీలో మొత్తం 13,504 కుటుంబాలు సర్వే చేయగా, వాటిలో గురువారం సాయంత్రం వరకు 7,205 కుటుంబాల వివరాలు నమోదు పూర్తయ్యాయి. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 25 సిస్టంలు, మున్సిపల్ కార్యాలయంలో 10 సిస్టంలలో నమోదు కొనసాగుతోంది. మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. 50శాతం పూర్తయ్యిందని, మరో నాలుగురోజుల్లో 100శాతం చేస్తామని ఆయన తెలిపారు. ఇక మండలంలో 15,330 కుటుంబాలను సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. వాటిలో సాయంత్రం వరకు 9,437 కుటుంబాల నమోదు పూర్తయ్యాయి. మండల పరిషత్ కార్యాలయం, శ్లోక బిర్ల పాఠశాల, గంగాపురం జెడ్పీ హైస్కూల్‌లో మొత్తం 40సిస్టంలలో నమోదులు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం వరకు 61శాతం నమోదు అయ్యిందని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు.



డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ నమోదు

సఫాయిమిత్రలకు ఒకరోజు శిక్షణ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపల్ కార్యాలయ కాంప్లెక్స్ లోని కళాభారతి భవనంలో సుమారు 50 మంది సఫాయి మిత్రలకు గురువారం ఒకరోజు శిక్షణఇచ్చారు. సెప్టిక్ ట్యాంకులు, పబ్లిక్ టాయ్‌లెట్లు, డ్రెయినేజీలను శుభ్రం చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కేపీఎం ఫౌండేషన్ ప్రతినిధి చిన్నికృష్ణ వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురులింగం, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ చరణ్, ఎస్‌బీఎం కన్సల్టెంట్ సుమీత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



దోకూర్ కస్తూర్బాలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలిస్తున్న అధికారులు

దేవరకద్ర: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. గురువారం మండలంలోని డోకూర్ సమీపంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. వంటపాత్రలను పరిశుభ్రం చేసి వంట చేయాలని, వంట గదిని శుభ్రంగా ఉంచాలన్నారు. బియ్యంలో పురుగులు లేకుండా వండాలని, తాజాగా ఉండే కూరగాయలు వాడాలని కోరారు. భోజనం వండిన తరువాత పాఠశాలలో పని చేసే ఒక ఉద్యోగి ముందుగా భోజనం చేయాలని, ఆ తరువాత అరగంటకు విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ఇది ప్రతిరోజు ఆచరించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో ఎంఈఓ బలరాం, తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ విఫలం

పాలమూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రైతు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పందంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణి పోర్టల్ బంగాళాఖాతంలో కలుపుతానని చెప్పి, ఏడాది అవుతున్నా ధరణి సమస్యలు తీర్చలేదన్నారు. ఏడాదికి రైతు భరోసా రూ.15వేలు ఇస్తానని ఇప్పటికి అమలు కాలేదన్నారు. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులకు పనులకు నిధులు లేక అసంపూర్తిగా మిగిలిపోయాయని తెలిపారు.

స్కూల్ ప్రిన్సిపాల్‌కు అవార్డు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ఇచ్చే సేవారత్న 2024 అవార్డును జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ కిరణ్మయి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాలలో సన్మానించారు. ట్రాస్మా నాయకులు లక్ష్మణ్ మాట్లాడుతూ ఇటువంటి అవార్డు రావడం గొప్ప విషయమన్నారు.



నేడు జామీయ మసీద్‌లో ధార్మిక సభ

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని ప్రసిద్ధ యూనివర్సిటీ జామీయ నిజామియా ఫౌండర్ హజ్రత్ మహ్మద్ అన్వారుల్లా ఫారూఖీ రహెమతుల్లా అలై 110వ ఉర్సు వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జామీయ మసీద్‌లో శుక్రవారం రాత్రి 7 గంటలకు ధార్మిక సభ నిర్వహిస్తున్నట్లు పలువురు మతపెద్దలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని జామీయ మజీద్‌లో ధార్మిక సభకు సంబంధించిన పోస్టర్లను గురువారం వారు ఆవిష్కరించారు.

మార్మోగిన అయ్యప్పనామస్మరణ



మహమ్మదాబాద్: మండలంలోని గాధిర్యాల్‌లో గాజుల ఆంజనేయులు స్వగృహంలో గురువారం పడిపూజ నిర్వహించారు. గురుస్వాములు శ్రీనివాస్, రాజు, చెన్నయ్య, పాలెం శ్రీను, బాల్‌రాజ్ గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు రవి, వేణు, నాగరాజు, ఆంజనేయులు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

రాజాపూర్: మండల కేంద్రంలో జాతీయ రహదారిని దాటుతున్న మహిళను బైక్ ఢీకొట్టడంతో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్‌కు చెందిన శారద భర్త చంద్రశేఖర్‌రెడ్డిలు రాజాపూర్ మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. శారద మల్లేపల్లి వైపు నుంచి జాతీయ రహదారిని దాటుతుండగా, హైదరాబాద్ నుంచి ఈద్గాన్‌పల్లి వైపు వెళ్తున్న ఈద్గాన్‌పల్లికి చెందిన రాజేందర్ యాదవ్ బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. శారద భర్త చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీడీ కార్మికులకు సమస్యలు పరిష్కరించాలి

చిన్నచింతకుంట: ప్రభుత్వం బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశాడు. గురువారం మండలంలోని పర్దిపురంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బీడీ కార్మికులు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. సరైన వేతన కూలి అందక దుర్భర జీవితం కొనసాగిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీడీ కార్మికుల సమస్యలపై దృష్టి సారించాలని, 30న మహబూబ్‌నగర్‌కు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆయనకు విన్నవిస్తామన్నారు. కార్యక్రమంలో బొజ్జన్న, బాబు, దేనియల్, చెన్నప్ప, తదితరులు ఉన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ సమావేశ మందిరంలో జన వి/్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులలకు శాస్త్రీయ పరి/్ఞానాన్ని, సైన్స్‌పై మక్కువ పెంచే విధంగా ఉన్న ఇలాంటి పరీక్షలు ఎంతో దోహదపడతాయన్నారు. సమాజంలో మూఢవిశ్వాసాలు, నమ్మకాలను రూపుమాపేందుకు విద్యార్థులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చదువుకున్న విద్యార్థులు సైన్స్‌కు వాస్తవానికి దగ్గరా ఉండే విధంగా మాత్రమే ఆలోచన ధోరణి ఉండాలని, అప్పుడు మనం చదువుకున్న చదువులకు పూర్తిస్థాయిలో పరిపక్వత చెందుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా మన జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపాలని కోరారు. కార్యక్రమంలో పీయూ అధ్యాపకులు గురుస్వామి, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, జన వి/్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రహ్లాద్‌రెడ్డి, వెంకటస్వామి, గౌరవ అధ్యక్షుడు రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు అశోక్‌గౌడ్ వేణుగోపాల్‌శర్మ, కార్యదర్శులు వేణుగోపాల్ వర్మ, శ్యాంసుందర్, సతీష్ కుమార్, ప్రమోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి రాష్ట్రస్థాయి పోటీలకు మౌంట్‌బాసిల్ విద్యార్థులు



మౌంట్‌బాసిల్ విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్, తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జనవి/్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీలకు మౌంట్‌బాసిల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీల్లో వివిధ మండలాలకు చెందిన 41 పాఠశాలలు పాల్గొనగా.. మౌంట్‌బాసిల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని శ్రీచైత్రిక, 9వ తరగతి విద్యార్థిని పరిమళ, 10వ తరగతి విద్యార్థిని సాయిశ్రీచరణ్ ఎంపికయ్యారు. వీరికి డీఈఓ ప్రవీణ్‌కుమార్ బహుమతులను అందజేశారు. ఎంపికైన వారు డిసెంబర్ 14 నుంచి 16 వరకు ఆదిలాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ చంద్రకళావెంకటయ్య, డైరెక్టర్ శిరీష ప్రవీణ్, పూజితా మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సోమశేఖర్, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. అభినందించారు.

ప్రతి విద్యార్థికి ఆధార్ తప్పనిసరి

దేవరకద్ర: ప్రతి విద్యార్థి ఆధార్‌ను తప్పని సరిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని మండల విద్యాధికారి బలరాం కోరారు. గురువారం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మండల హెచ్‌ఎమ్‌ల సమావేశం నిర్వహించారు. విదార్థి ఆధార్ అప్‌లోడ్ చేస్తేనే ఆపార్ కార్డు జనరేట్ అవుతుందన్నారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే వచ్చే నెల 4న ప్రారంభమవుతుందని, అప్పటిలోగా విద్యార్థుల సామర్థ్యాలను పెంచి సంసిద్ధం చేయాలని ఎంఈఓ సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, నాణ్యమైన భోజనం అందించే విధంగా హెచ్‌ఎమ్‌లు పర్యవేక్షణ చేయాలని కోరారు. నిర్లక్ష్యం చేస్తే శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో హెచ్‌ఎమ్‌లు శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, కృష్ణ, అబ్దుల్‌హక్, సిబ్బంది చంద్రశేఖర్‌గౌడ్, రాధిక, శారద, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

దేవరకద్ర: మండలంలోని కోయిల్‌సాగర్‌లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు క్వింటాల్ ధాన్యానికి బోనస్ రూ. 500 జమ చేయడంపై పలువురు రైతులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కోన రాజశేఖర్, చందుగౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్, నాయకులు నాగిరెడ్డి, కథలయ్య, మోహన్, రైతులు పాల్గొన్నారు.



కోయిల్‌సాగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

సాక్షి, నెట్‌వర్క్: బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతిరావు పూలే కృషి చేశారని డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాటికొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.




పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

- కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ మాట్లాడారు. కార్యక్రమంలో టి.సాగర్, ఆర్.వెంకటరాములు, ఆది విష్ణు, రాజు, నందు, భాస్కర్, సురేష్, విజయ్ పాల్గొన్నారు.
- జడ్చర్లలో ఎమ్మార్పీ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయ సమీపంలో పూలే విగ్రహాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ ప్రసంగించారు.

పీయూలో జ్యోతిరావు పూలే

- పీయూలో జ్యోతిరావు పూలే వర్ధంతిని బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తాయప్ప మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రకిరణ్, కృష్ణయ్య, బీసీ సెల్ డైరెక్టర్ ప్రవీణ, రామ్మోహన్, జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి వెంకటేష్, గాలెన్న, రవీందర్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, నాయకులు, విద్యార్థులు

మార్కెట్‌కు రూ.45.74 లక్షల ఆదాయం

దేవరకద్ర: మండల కేంద్రంలోని మార్కెట్‌లో గత ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నవంబర్ వరకు జరిగిన లావాదేవీలలో రూ.45.74 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ చైర్మన్ కతలప్ప తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా మార్కెట్ యార్డులో రైతు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఎనిమిది నెలల్లో మార్కెట్‌కు 1,20,819 క్వింటాళ్ల వరిధాన్యం అమ్మకానికి వచ్చిందని, దీనికి రూ.45,74,55,942 కోట్ల లావాదేవీలు జరిగాయని తెలిపారు. దీనికి మార్కెట్ ఫీజు కింద రూ.45.74 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. మార్కెట్‌లో 6249 మంది రైతులు లబ్ధిపొందినట్లు తెలిపారు. మార్కెట్ యార్డులో కాంపౌండ్ వాల్ నిర్మాణం, పాత షాపుల మరమ్మతులు చేయించేందుకు అంచనా రూపొందించి ప్రతిపాదనలు పంపించామన్నారు. సంబరాలలో పలువురు వ్యాపారులు, రైతులు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.



దేవరకద్ర మార్కెట్‌లో రైతు సంబరాలు ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ కతలప్ప